క్లుప్తంగా

పవిత్రోత్సవాలకు అంకురార్పణ


అంకురార్పణ నిర్వహిస్తున్న వేదపండితులు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయంలో ఏడాది పొడవునా పలు క్రతువుల్లో తెలిసో తెలియకో జరిగిన దోషాల నివారణకు ప్రతి ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం పరిపాటి. శుక్రవారం పవిత్ర ప్రతిష్ఠ, శనివారం పవిత్ర సమర్పణ, చివరి రోజు మహా పూర్ణాహుతితో ఇవి ముగుస్తాయి. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, మణికంఠ ఆచార్యులు, బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేశ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌటిల్య ఆధ్వర్యంలో ఇండక్షన్ శిక్షణ


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో బీటెక్ ప్రవేశాలు పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్ ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఎంప్లాయిబిలిటీ, ఉద్యోగా సాధనలో మెళకువలు, స్కిల్క్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థుల సారించాల్సిన దృష్టి వంటి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ డాక్టర్ ఎస్ఎస్‌రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

49 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : నగరంలో వాహనదారులు, ప్రజలకు ఆటంకం కలిగిస్తూ రోడ్డుపై వ్యాపారాలు నిర్వహిస్తున్న 49 మందికి 24 వేలా 500 రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి గురువారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీ నిర్వహించి ఆటంకం కలిగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు కోర్టు కానిస్టేబుల్ శివుడు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కోర్ ఎడ్యుకేటర్ బాలాజి

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లెలో గురువారం ఎయిడ్స్ నివారణ సంస్థ, చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కోర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోర్ ఎడ్యుకేటర్ బాలాజి మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ వెళ్లి ఎయిడ్స్‌పై కరపత్ర ప్రచారంతో అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది? దాని వ్యాప్తి, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్టు తెలిపారు. సమాజంలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని కోరారు. కార్యక్రమంలో కోర్ ప్రాజెక్ట్ మేనేజర్ సద్దాం, డీఎండీఓ ఎస్.శంకర్, ఏఆర్‌డబ్ల్యూ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాలపై పోరాటాలకు సన్నద్ధం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆటో కార్మికుల వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలకు సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శివ పిలుపు నిచ్చారు. ఆటో కార్మికుల సర్వ సభ్య సమావేశం గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ఆటో కార్మికులు సంఘటిత పోరాటంతో ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు సాధన కోసం, ఎన్నికల నేపథ్యంలో కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలనిఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జీఓ 21,31లను వెంటనే రద్దు చేయాలని, మహిళలకు ఉచిత బస్సు పథకంతో నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘ నేతలు పురుషోత్తంరెడ్డి, ఎన్‌డీ.రవి, మురళి, జయరాజ్, మధు, శంకర్, సురేష్, ఆటో కార్మిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బై..బై..వినాయకా..!

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులోని వినాయక సాగర్ వద్ద గురువారం నిమజ్జన కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చవితి మండపాలలో తొమ్మిది రోజు పాటు వినాయక విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన నిర్వాహకులు గురువారం వినాయక విగ్రహాలను మేళతాళాలు, డ్రమ్స్ హోరు, యువత కేరింతల నడుమ వాహనాల్లో వినాయక సాగర్‌కు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ ఏడాది ప్రత్యేకంగా డీఆర్ మహల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ చీర వినాయక విగ్రహానికి, యాదవ్ వీధిలో కంచి కామాక్షి దీపాలతో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి. నగరంలో విశేష పూజలందుకున్న గణపతి విగ్రహాల నిమజ్జనం పరిపూర్ణమైంది.


పాకాలలో..

పాకాల: స్థానిక పాత పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. తొలుత నిర్వహించిన తోటోత్సవం యువత ఉత్సాహంగా పాల్గొంది. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే స్థానిక భారతంమిట్ట, దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లె, ఇతర గ్రామాల్లో కూడా కోలాహలంగా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండల వ్యాప్తంగా గురువారం మండపాల్లో కొలువైన వినాయక విగ్రహాలకు పెద్ద ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం స్వామివారి ముందు పూజలను నిర్వహించి, యువకులు ఉత్సాహంగా ఉట్లోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలకు వేలం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి, డప్పులు వాయిస్తూ, కేరింతలు కొడుతూ యువకులు నిమజ్జనానికి తరలించారు.


పాకాల: పాత పోస్టాఫీసు వినాయకస్వామి ఊరేగింపు


చంద్రగిరి: జమండ్లవీధిలోని వినాయక స్వామిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు


తిరుపతి కల్చరల్ : వినాయక సాగర్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు

వైఎస్సార్ సీపీ నేతల వినాయక ఉత్సవంపై పోలీసుల వివక్ష

తిరుపతి నగరంలో ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల్లో పోలీసులు వివక్షతో వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది. టౌన్ క్లబ్ వద్ద ఇందిరానగర్‌లో వైఎస్ఆర్‌సీపీ నేతలు, అలాగే ఇదే ప్రాంతంలో జనసేన, టీడీపీ నేతలు సైతం తమ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఇందిరా నగర్‌లో టీడీపీ, జనసేన నేతలు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. అయితే వైఎస్ఆర్‌సీపీ నేతలు వినాయక విగ్రహం ఊరేగింపు చేయనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దేవుని ఊరేగింపును కూడా రాజకీయం చేస్తూ పోలీసుల వివక్ష చూపడం ఏమిటని ప్రశ్నించారు.


వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల నిమజ్జన ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

నోటీస్ బోర్డు

- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు గురుపూజోత్సవం.
- స్విమ్స్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయ దినోత్సవం.
- వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు ఆటో కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశం.
- యోగమల్లవరం వద్దనున్న శ్రీసాలగ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రాత్రి 7 నుంచి శీఘ్ర వివాహయోగ శ్రవణానక్షత హోమం

6న చలో విజయవాడ

తిరుపతి సిటీ: రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో సెప్టెంబర్ 6న నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడకు వేలాది మంది విద్యార్థులు తరలిరావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ నాయకులు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు రూ. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దీనిని పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరిగినా ప్రభుత్వం హాస్టల్ మెస్ చార్జీలు మాత్రం పెంచలేదని, ఒక్కో విద్యార్థికి రూ. 3వేలు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలను నివారించే చర్యలు పూనుకోవడం దుర్మార్గమన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహించాలని, విద్యార్థుల ప్రజాస్వామ్యం కాపాడుకుందామని యువగళం పాదయాత్రలో గళం విప్పిన నారా లోకేష్ మంత్రి అయ్యాక మాట మార్చడం శోచనీయమని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, యూనివర్సిటీ అధ్యక్షులు నరసన్న, నాయకులు తిరుమలేష్, వాసు, షేక్షావల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా రమేష్

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎస్వీ యూనివర్సిటీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా టీ.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఏపీ గవర్నర్ కార్యాలయం ఉత్తర్వుల మేరకు ఆయన మూడేళ్ల పాటు ఆ పదవిలో ఉంటారు.

పారదర్శకంగా రీసర్వే చేయండి

తిరుపతి తుడా: నగరంలో నక్ష (రీసర్వే) కార్యక్రమాన్ని పారదర్శకంగా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. గురువారం కచ్చపి ఆడిటోరియంలో వార్డు ప్లానింగ్, అమెనిటీ సెక్రటరీలు, వీఆర్ఓలకు నక్ష ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ సర్వే కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10 ప్రాంతాలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసిందని, వీటిలో తిరుపతి ఒకటని అన్నారు. నగరంలోని అన్ని ప్రాపర్టీలను క్షుణ్ణంగా సర్వే చేసేలా 50 బృందాలను ఏర్పాటు చేశామని, ఈ సర్వే 60 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్వేలో స్థానిక నాయకులను భాగస్వాములను చేసి వారి సహకారం తీసుకోవాలని సూచించారు. 'నక్ష' సర్వేకు వచ్చిన బృందానికి నగరంలోని అన్ని భవనాల యజమానులు, స్థల యజమానులు భూ రికార్డు పత్రాలను చూపించి ఆన్‌లైన్ రికార్డుల్లో స్థలాలను నిక్షిప్తం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ , రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

గురువులకు ఘన సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి సిటీ: స్థానిక ముత్యాలరెడ్డిపల్లె సర్కిల్‌లోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్, రేవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి అర్బన్ మండలంలోని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తహసు నిస్సా బేగం మాట్లాడుతూ, గురువులు భావిభారత నిర్మాతలని అభివర్ణించారు. ఉపాధ్యాయులను శ్రేష్ఠ గురు అవార్డులతో సత్కరించారు. ఎంఈఓ బాలాజీతో కలసి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బి.భాస్కర్ నాయక్, కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పాకాల: స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాలలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు గురువారం ఎంఈఓలు బాబ్జి, లింగయ్యల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు మాట్లాడుతూ, అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి ఉత్కృష్టమైనదని, సమాజాన్ని మార్చగల శక్తి ఒక్క ఉపాధ్యాయ వృత్తికే ఉందన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ వెటర్నరీలో..

చంద్రగిరి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం శ్రీవేంకటేశ్వర పశువైద్య కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తుగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ జేఎస్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా వీసీ రమణరావు హాజరయ్యారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కీర్తించారు. అనంతరం జేఎస్ రెడ్డిను సిబ్బంది ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


పాకాల: ఉత్తమ టీచర్లను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


చంద్రగిరి: విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ జేఎస్ రెడ్డిను సత్కరిస్తున్న వెటర్నరీ సిబ్బంది

లోకేష్ 'యువగళం' హామీలను నెరవేర్చాలి

తిరుపతి కల్చరల్: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ఆటో స్టాండ్‌ను గురువారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. డిగ్రీలు, పీజీలు చేసి, ఉద్యోగాల రాక, ఆటోలు ఎంచుకుని కుటుంబాలను పోషిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు ప్రోత్సహించడం పోయి వారిపై పన్నులు వేసి నడ్డివిరుస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు అందిరికీ రూ.15 వేలు ఇస్తామని, ఎలక్ట్రికల్ ఆటోను రుణరూపంలో ఇప్పిస్తామని, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద రూ.25 వేలు ఇస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టారని, ఇప్పుడాహామీల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు రాము, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.సుబ్రమణ్యం, ఎస్.మాధవకృష్ణ, వేణుగోపాల్, బాదుల్లా, వాసు, శంకర్, రమేష్, గణేష్, దినేష్, రాజా, నీలకంఠ, తులసి, వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షుడు జయచంద్ర

ప్రసూతి హాస్పిటల్లో అన్నమాచార్య సంకీర్తనలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ప్రజల్లోనే కాకుండా స్థానిక ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్లో రోగులు, వారి సహాయకుల్లోనూ ఆధ్యాత్మికత, భక్తి భావాలను పెంపొందించేందుకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఉపక్రమించింది. ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో అన్నమాచార్య సంకీర్తనలు, హరికథ గానం ఇత్యాది కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోంది. శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రాజెక్టు గాత్ర కళాకారుడు సుబ్రహ్మణ్యం బృందం అన్నమాచార్య సంకీర్తనలను కార్యక్రమం నిర్వహించనుంది. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల, సీఎంఓ డాక్టర్ ఆర్ఆర్.రెడ్డి విజ్ఞప్తి మేరకు దీనికి పూనుకున్నట్టు అన్నమాచార్య ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

తిరుమలలో జీఎస్టీ ఎత్తివేయాలి

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుమలలో జీఎస్టీ పన్నులను ఎత్తివేయాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా టీటీడీ పాలక మండలి కూడ ప్రతిపాదనలు చేయాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. గత ఐదేళ్లలో టీటీడీ జీఎస్టీ కింద రూ.150 కోట్లకు పైగా చెల్లించిందని, కేవలం 2024లోనే రూ. 50 కోట్ల వరకు ఈ పన్ను చెల్లింపు ఉందని స్వయంగా లోక్ సభలో ఆర్థిక మంత్రిత్వ శాఖ తరపున మంత్రి పంకజ్ చౌదరి ప్రకటించారని గుర్తు చేశారు. మతపరమైన అంశాలకు, ప్రసాదాలకు, వెయ్యి రూపాయలు లోపు అద్దె చెల్లించే కాటేజీలకు జీఎస్టీ వర్తించదని అంటూనే తిరుమలలో తయారయ్యే లడ్డూ ప్రసాదానికి సరఫరా చేసే ముడి సరుకులు, అలాగే ఉచిత అన్నదాన పథకానికి కొనుగోలు చేసే ముడి సరుకులపై సైతం జీఎస్టీ విధిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం, పాలకమండలి, టీటీడీ యాజమాన్యం జీఎస్టీ మినహాయింపులు కోరుతూ యుద్ధ ప్రాతిపదికన ప్రయత్నాలు చేయాలని కోరారు.

భక్తిప్రపత్తులతో పవిత్ర సమర్పణ

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో రెండవ రోజు గురువారం పవిత్ర సమర్పణ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపానికి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులు వేంచేపు చేశారు. అక్కడ స్నపన మంజనం, ఆస్థానం..ఇత్యాది కార్యక్రమాల అనంతరం పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం, రాత్రి యాగశాలలో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్, చిన్నజీయర్, చిన్నజీయర్లు, ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ ఏబీ.నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవార్ల ఉత్సవవమూర్తులకు పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు

వైభవంగా గణపతి నవరాత్రులు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపాన శ్రీ శక్తిపీఠంలో గణపతి నవరాత్రుల భాగంగా గురువారం తొమ్మిదో రోజున వైభవంగా జరిగాయి. పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతి, శ్రీ రమ్యానందభారతీ ఆధ్వర్యంలో గణపతికి పంచామతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష మోదకాల హోమాలలో భాగంగా 11,116 మోదకములతో శ్రీ చింతామణి గణపతి మంత్రహోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.




తిరుపతిలో నేటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

తిరుపతి కల్చరల్: క్రెడాయ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు డీబీఆర్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో-2025ను నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ కె.గోపీనాథ్, అధ్యక్షుడు ఎం.రాంప్రసాద్ తెలిపారు. గురువారం తిరుమల బైపాస్ రోడ్డులోని క్రెడాయ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో గత 12 ఏళ్లుగా తిరుపతిలో ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నిర్మాణ రంగ ఉత్పత్తులను ప్రజలకు, బిల్డర్లకు పరిచయం చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోలో నిర్మాణ రంగ ఉత్పత్తులకు సంబంధించిన ప్రముఖ కంపెనీలతో పాటు ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాస్, స్టీల్, సిమెంట్ బిల్డింగ్ మెటీరియల్, ఫర్నీచర్ పెయింటింగ్స్ వంటి అనేక ఆధునాతన టెక్నాలజీ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచుతారని తెలిపారు. గృహ రుణాలకు సంబంధించిన ప్రముఖ బ్యాంకులు, ఆటోమొబైల్స్, ఇతర కంపెనీల ద్వారా సుమారు 57 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే టాప్ మోడల్ కార్లు, బైక్‌లు వంటి వాటిపై అవగాహన కలిగించేలా ఆయా కంపెనీల స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో క్రెడాయ్ కోశాధికారి కె.హరికృష్ణ, ఉపాధ్యక్షుడు ఏ.రాజేష్‌బాబు, కార్యదర్శి పి.నరసింహులు, సహాయ కార్యదర్శి పి.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్రెడాయ్ చైర్మన్, అధ్యక్షుడు

బాల్య వివాహాలను నిరోధిద్దాం


అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

రామచంద్రాపురం: ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్న పక్షంలో నిరోధించడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీలా కోరారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని కమ్మ కండ్రిగ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మనీలా మాట్లాడారు. ఎంఈఓ, హెచ్‌ఎంలు, టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.